క్లుప్తంగా

పేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎన్‌సీడీ అధినేత శ్రీనివాసరావు

శంకర్‌పల్లి: 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ వ్యాపారవేత్త, ఎన్‌సీడీ అధినేత శ్రీనివాసరావు శనివారం మోకిలలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీవితంలో ఉన్నతమైన స్థానానికి ఎదిగినప్పటికీ మన మూలాలు ఎప్పుడూ మరిచిపోవద్దని సూచించారు. అదేవిధంగా అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ తమకు ఉన్న దాంట్లో కొంత మేర సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను విధుల నుంచి తొలగించాలి

మొయినాబాద్: వార్డు కార్యాలయాల వద్ద జెండా ఎగురవేయకుండా జాతీయ జెండాను అవమానపర్చిన మున్సిపల్ కమిషనర్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని సీపీఎం మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వార్డు కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగురవేయాలని స్థానిక ప్రజలు కోరితే వారిపట్ల దురుసుగా మాట్లాడటం ఆయన అహంకార ధోరణికి నిదర్శనమన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి నియంతలా వ్యవహరిస్తున్న మున్సిపల్ కమిషనర్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవాలి

మోకిల సీఐ వీరబాబు

శంకర్‌పల్లి: వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మోకిల సీఐ వీరబాబు అన్నారు. శనివారం మోకిల పోలీస్ స్టేషన్‌లో గ్రామాల గణేశ్ ఉత్సవ కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్సవ కమిటీలు ముందుగా పోలీసుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, అదేవిధంగా డీజేలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. ఎక్కడ అవాంఛనీయ సంఘనలు చోటుచేసుకోనివ్వకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జాగృతి మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎండీ.ముస్తఫా



మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను కలిసిన జాగృతి నాయకులు

షాద్‌నగర్: జాగృతి డివిజన్ మాజీ కన్వీనర్ ఎండీ.ముస్తఫా జాగృతి మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం ముస్తఫా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా అంజయ్యయాదవ్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో మరిన్నీ ఉన్నత పదవులు అందుకోవాలని ఆకాంక్షించారు. జాగృతి బలోపేతానికి అహర్నిశలు పనిచేసిన వారికి తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యేను కలిసిన వారిలో జాగృతి విద్యార్థి విభాగం మాజీ డివిజన్ కన్వీనర్ బాలాజీఉదయ్, నాయకులు తదితరులు ఉన్నారు.

రోడ్డు అభివృద్ధికి కృషి చేయాలని వినతి

మొయినాబాద్‌రూరల్: మండలంలోని తోల్‌కట్ట–నక్కలపల్లి రోడ్డు అధ్వానంగా మారిందని, అధికారులు రీబీటీ వేయించేందుకు కృషి చేయాలనికాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బొక్క వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ఆయన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు తోల్‌కట్ట–నక్కలపల్లి రోడ్డు అభివృద్ధికి కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలో మారుమూల గ్రామాలు తోల్‌కట్ట, ఎత్‌మార్‌పల్లి, నక్కలపల్లి గ్రామాలకు వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. పది సంవత్సరాల నుంచి ఈ రోడ్డుకు కనీసం మరమ్మతులు కూడా చేయలేదన్నారు. దీంతో రోడ్డుపై గుంతలు పడి, కంకర తేలి అధ్వానంగా మారడంతో వాహదారులు ఇబ్బంది పడుతున్నారని, రీబీటీ వేసి రోడ్డును బాగుచేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీంతో మంత్రి స్పందించి ఈ రోడ్డు విషయమై త్వరలో అధికారులతో కలిసి పరిశీలించి.. రీబీటీ చేసేందుకు కృషి చేస్తామని తెలిపినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, పార్టీ జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ మహేందర్‌ముదిరాజ్, జంగయ్య, రాజుగౌడ్ పాల్గొన్నారు.



చేవెళ్ల: చిన్నికృష్ణుడి వేషధారణలో హిమాన్ష్



కేశంపేట: కృష్ణాష్టమి వేషధారణలో చిన్నారులు

ముకుందా.. ముకుందా

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. చిన్నికృష్ణుడు, గోపిక వేషాధారణలో చిన్నారులు ఎంతగానో అలరించారు. ఉట్లు కొట్టే కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముకుందా.. ముకుందా అంటూ పలు పాఠశాలల్లో చిన్నారులు చేసిన నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. మహిళలు ఇంటి గుమ్మాల ఎదుట రంగురంగుల ముగ్గులతో శ్రీకృష్ణుడి పాదాలను వేసి అలంకరించారు.



కేశంపేట: చిన్నికృష్ణుడి వేషధారణలో శ్రీయాన్ష్



మొయినాబాద్: రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు



కొందుర్గు: శ్రీకృష్ణుడిగా చిన్నారి



చేవెళ్ల: శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు



షాద్‌నగర్‌రూరల్: కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



షాద్‌నగర్: గోపిక వేషధారణలో గానవి



షాద్‌నగర్: చిన్నికృష్ణుడి వేషధారణలో చిన్నారి



షాద్‌నగర్: శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని 6, 9 వార్డుల్లో ఆయన పర్యటించారు. కాలనీవాసులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సమస్యలను పరిష్కరించాలని ఆయా కాలనీవాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో గల కిషన్‌నగర్ రోడ్డు, బీరప్పకాలనీ, జీహెచ్‌ఆర్ కాలనీల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను 15 రోజుల్లోనే పరిష్కరించామని స్పష్టం చేశారు. కాలనీవాసులు చెప్పిన వెంటనే విద్యుత్ అధికారులతో సమీక్షించి విద్యుత్ నియంత్రికలు, స్తంభాలను ఏర్పాటు చేయించామన్నారు. కాలనీవాసులందరూ చర్చించుకొని సమస్యలను మా దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ నియంత్రికలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు.



కాలనీలలో పర్యటించి సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

దసరాలోపు పూర్తి చేస్తాం

మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో పర్యటించిన ఎమ్మెల్యేకు సాయిబాబకాలనీ, టీచర్స్‌కాలనీల్లో నెలకొన్న సమస్యలపై కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే దసరాలోపు అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ప్రధానంగా అంతర్గత మురుగు కాల్వలు, సీసీ రోడ్లు, వీధిదీపాల ఏర్పాటు వంటి సమస్యలను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్‌అలీఖాన్‌బాబర్, నాయకులు కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, ఎండీ.ఇబ్రహీం, ప్రవీణ్, ఖదీర్, శ్రీనునాయక్, కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు

షాద్‌నగర్‌రూరల్: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్లు లతాశ్రీశ్రీశైలంగౌడ్, జూపల్లి కౌసల్యశంకర్ దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి అభిషేకం, ప్రత్యేక పూజలు, పల్లకీసేవ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల భజనలు, పాటలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం ఆలయ అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రచార్య, కృష్ణ, ప్రమోద్, సునీల్ పంతులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. దాతలు కుమార్‌గౌడ్, యాదగిరి, నరేశ్‌గౌడ్ సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణానికి చెందిన నాగమోహన్, భవాని, లక్ష్మి ఆలయ అభివృద్ధికి రూ.6500ల విరాళాన్ని, గత సంవత్సరం వినాయకుడి లడ్డూ తీసుకున్న అంజి రూ.40వేలు, హన్మంతు బియ్యం బస్తా అందజేశారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు పులిమామిడి శ్రీశైలంగౌడ్ దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



స్వామివారి పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

భారీ వర్షం.. మిగిల్చిన నష్టం



దేవరంపల్లిలో వరద ఉధృతికి కొట్టుకుపోయి అడ్డంపడిపోయిన పత్తి మొక్కలు

చేవెళ్ల: భారీ వర్షంతో వాగుకు ఇరువైపులా ఉన్న రైతుల పంటల పొలాలకు తీరని నష్టం చేకూరింది. మండలంలోని దేవరంపల్లి నుంచి ప్రవహించే ఈసీవాగుకు ఇరువైపులా ఉన్న పంటలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. దీంతో తీరని నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. మండలంతో పాటు ఎగువన వికారాబాద్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు ఈసీవాగు పొంగి పొర్లి ఉధృతంగా పారింది. దీంతో వాగుకు ఇరువైపులా ఉన్న పంట పొలాలను సైతం వరద ముంచెత్తింది. దీంతో దేవరంపల్లికి చెందిన రైతులు వేసిన పత్తి, వరి, మొక్కజొన్న, క్యారెట్, జొన్న తదతర పంటలు వాగు వరదకు కొట్టుకుపోయి అడ్డం పడిపోయాయి. దీనికి తోడు పంటపొలాల్లో నిలిచిన వరద నీటితో కూడా ఉన్న పంటలు పాడవతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 200ల ఎకరాల వరకు పంటలు నష్టపోయాయని, దెబ్బతిన్న పంటలను అధికారులు, నాయకులు పరిశీలించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

బీఆర్‌ఎస్ నేతలు అనంతరెడ్డి, నర్సింహారెడ్డి

మొయినాబాద్: స్వాతంత్య్ర దినోత్సవం రోజు జాతీయ జెండాను అవమానపరిచే విధంగా వ్యవహరించిన మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్‌ను ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలని బీఆర్‌ఎస్ నేతలు కొంపల్లి అనంతరెడ్డి, కొత్త నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మొయినాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని అన్ని వార్డు కార్యాలయాల వద్ద జాతీయ జెండా ఎగురవేయాలని స్థానిక నాయకులు, ప్రజలు మున్సిపల్ కమిషనర్‌ను కోరినా ఆయన నియంతలా వ్యవహించారని ఆరోపించారు. ప్రజలకు సరైన సమాధానం చెప్పకుండా తన ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ అందరినీ కించపరిచేలా వ్యవహించాడని మండిపడ్డారు. మున్సిపల్ కార్యాలయానికి ఏదైనా పనికోసం ప్రజలు వెళ్లినా దురుసుగా మాట్లాడుతున్నారన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులపై దృష్టి పెట్టకుండా.. ఎక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయో అక్కడికి వెళ్లి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇంటి నంబర్లు ఇవ్వడానికి రూ.లక్షల్లో డబ్బులు తీసుకుంటున్నారని.. తన చుట్టూ కొంత మందిని కోటరిగా పెట్టుకొని వసూలు చేస్తున్నారన్నారు. నియంతలా వ్యవహరిస్తున్న మున్సిపల్ కమిషనర్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కోట్ల నరోత్తంరెడ్డి, శ్రీహరియాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోర శ్రీనివాస్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రవుఫ్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఆర్వో ప్లాంట్ ఏర్పాటు



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

షాద్‌నగర్: విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలను సాధించాలని ఏసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ ప్రభుత్వ పాఠశాలలో గతంలో ఐ సడక్ ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. గత కొన్ని నెలలుగా ఆర్వో ప్లాంట్ పని చేయకపోవడంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఉపాధ్యాయులు పలువురికి తెలిపారు. వెంటనే స్పందించిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కుమ్మరి శ్రీనివాస్ రూ.70వేలతో ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయించారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఏసీపీ హాజరై ప్రారంభించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

చేవెళ్ల: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని న్యాలట అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి నర్సింలు అన్నారు. మండలంలోని న్యాలటలో శనివారం నిర్వహించిన సమావేశంలో సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాళ్లపల్లి నర్సింలు, ఉపాధ్యక్షుడిగా తాళ్లపల్లి సంజీవ, జాయింట్ సెక్రటరీగా గూడెపు కుమార్, కోశాధికారిగా అలూరి సునీల్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. గ్రామంలో కమిటీ ద్వారా అంబేడ్కర్ చూపించిన మార్గాలను ఆదర్శంగా తీసుకొని ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

దాతల సహకారం అభినందనీయం

మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు

షాద్‌నగర్‌రూరల్: పురాతన దేవాలయంలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విరాళాలను అందించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాయికృష్ణ రూ.1,00,111ల చెక్కును మాజీ ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాచీన దేవాలయాలు మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. అలాంటి ఆలయాలను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం దాత సాయికృష్ణకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ కో–ఆప్షన్ సభ్యులు ఒగ్గు కిషోర్, కుమార్‌గౌడ్, పలబట్ల బాల్‌రాజ్, సాయిఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న సాయికృష్ణ

వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయం



శంకర్‌పల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు



చేవెళ్లలో నివాళులర్పిస్తున్న నాయకులు

బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంతర్‌రెడ్డి

చేవెళ్ల: దేశ రాజకీయ చరిత్రలో అజరామరమైన నాయకుడు మాజీ ప్రధాని, భారతరత్న అవార్డు గ్రహీత అటల్ బిహారీ వాజ్‌పేయి అని బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి, ప్రజాస్వామ్యాన్ని బలపరిచిన దూరదృష్టిగల నాయకుడని కొనియాడారు. ఆయన చూపించిన మార్గాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని, ఆయన సేవలు చిరస్మరణీయని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కుంచం శ్రీనివాస్, జైశంకర్, పత్తి సత్యనారాయణ, కృష్ణారెడ్డి, అశోక్, రాజు, శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీన్‌రెడ్డి, గణేశ్, భార్గవ్‌రెడ్డి, ప్రకాశ్, కరుణాకర్, పాగా వెంకటేశ్, సీహెచ్ శ్రీనివాస్, రవి, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, జయసింహారెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయిని ఆదర్శంగా తీసుకోవాలి

శంకర్‌పల్లి: దేశానికి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చేసిన సేవలు మరువలేనివని పట్టణ బీజేపీ నాయకులు అన్నారు. శనివారం మండలంలో వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల, మున్సిపల్ అధ్యక్షులు లీలావతి, దయాకర్‌రెడ్డి వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యువత వాజ్‌పేయి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాములుగౌడ్, వాసుదేవ్‌కన్నా, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ దేవాలయాల్లో సందడి



మొయినాబాద్‌రూరల్: చిన్నికృష్ణుడిని ఊయలలో వేసిన వేదపండితులు, భక్తులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని కనకమామిడి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో వివిధ గ్రామాల నుంచి చిన్నారులను శ్రీకృష్ణుడి వేశంలో వేసుకొచ్చి తులాభారం చేయించుకున్నారు. అనంతరం ఆలయంలో మామిడి తోరణాలు, పూలమాలలతో శ్రీకృష్ణుడి ఊయలను ఏర్పాటు చేసి దాంట్లో శ్రీకృష్ణుడిని వేశారు. దీంతో ఆలయ ప్రాంగణం శ్రీ కృష్ణ నామస్మరణతో మార్మోగింది. విచ్చేసిన భక్తులు స్వామివారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



షాబాద్: శ్రీకృష్ణ దేవాలయంలో భక్తుల సందడి

అధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

షాబాద్: అధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని నాగర్‌గూడ శ్రీకృష్ణ దేవాలయ నిర్వాహకులు తాళ్ల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని నాగర్‌గూడ శ్రీకృష్ణ దేవాలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఉట్లు కొట్టడం, అర్చన, హోమం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.